సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం : 20 : జనవరి : 2024



డోలీలో రోగి తరలింపు

అనంతగిరి మండలంలో అనారోగ్యానికి గురైన వ్యక్తిని కుటుంబసభ్యులు డోలీలో ఆస్పత్రికి తరలించారు.



శ్రీవారికి అభిషేక సేవ

రంపచోడవరం: ఐ.పోలవరం జంక్షన్ సమీపంలోని టీటీడీ శ్రీవారి ఆలయంలో అభిషేక సేవ ఘనంగా నిర్వహించారు. 8లో

ఘనంగా క్షీరాభిషేక సేవ



విశాఖ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవను ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

సెల్ టవర్ల ప్రారంభం 25కు వాయిదా

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: జిల్లాలోని 278 సెల్‌టవర్లను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ఈనెల 25వతేదీన ప్రారంభిస్తారని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈనెల 22,23తేదీల్లో ప్రారంభ కార్యక్రమం ఉంటుందని తగిన ఏర్పాట్లు చేసినప్పటికి 25వ తేదీకి వాయిదా పడిందన్నారు. అదేరోజు పాడేరు మండలం ఈదులపాలెం, డుంబ్రిగుడ మండలం లైగండలో సెల్‌టవర్లను సీఎం వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే సభల్లో ఆయన గిరిజనులతో మాట్లాడతారని తెలిపారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను ఈదులపాలెం, లైగండలో చేస్తున్నామని పీవో పేర్కొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పదాల వీరభద్రరావు తదితరులు

కొయ్యూరు: కాకరపాడులో అల్లూరి విగ్రహం ఏర్పాటుకు కేటాయించిన మూడు సెంట్ల స్థలంలోని ఆక్రమణలను తొలగించాలని జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పదాల వీరభద్రరావు తదితరులు కోరారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో తహసీల్దార్ తిరుమలరావుకు వినతిపత్రం అందజేశారు. ఆక్రమణలు తొలగించిన వెంటనే అక్కడ అల్లూరి విగ్రహంతో పాటు గాం గంటందొర విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఆక్రమణల తొలగించి అప్పగించాలని వీఆర్వో మరియమ్మ, సర్వేయర్ మూర్తిని ఆదేశించారు. ఈ మేరకు వారు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అల్లూరి యువజన సంఘం కార్యదర్శి శ్యామల వరలక్ష్మి, కార్యవర్గ సభ్యులు కోనా సత్యనారాయణ, పల్లా భాస్కర్ మణి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడి మృతి

- కేసు నమోదు చేసిన పోలీసులు



శరత్‌రెడ్డి మృతదేహం

అడ్డతీగల: మండలంలోని మల్లవరం మామిళ్ల సమీపంలోని తుప్పల్లో గురువారం అర్ధరాత్రి తీవ్రగాయాలతో అపస్మారక పడి ఉన్న యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని డి.భీమవరం గ్రామానికి చెందిన నడిపల్లి శరత్‌రెడ్డి(30)అనే యువకుడు రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నాడు. గురువారం అక్కడినుంచి బైక్‌పై స్వగ్రామం డి.భీమవరం బయలుదేరిన అతను మల్లవరం మామిళ్ల సమీపంలోని రోడ్డుపక్కన తుప్పల్లో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో గురువారం అర్ధరాత్రి పడి ఉన్నాడు. అదే మార్గంలో వెళ్తున్న వై.రామవరం 108 వాహనం సిబ్బంది అతనిని గమనించారు. వెంటనే అంబులెన్సులో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం రాజమహేంద్రవరం ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. ఈ మేరకు అతనిని అక్కడి ఆస్పత్రిలోకి తీసుకువెళ్తుండగా శరత్‌రెడ్డి మృతి చెందాడు. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. శరత్‌రెడ్డిని గుర్తు తెలియని వాహనం ఢీకొందా.. లేదా బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

అగ్రగామిగా ఏయూ

- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో నాలుగేళ్లలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు
- విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక కోర్సులు
- ఉపకులపతి ప్రొ.ప్రసాదరెడ్డి నేతృత్వంలో జాతీయ స్థాయిలో ఖ్యాతి
- ఆవిష్కర్తలుగా విద్యార్థులు.. స్టార్టప్‌లకు హబ్‌గా విశ్వవిద్యాలయం
- ప్రతి అడుగూ.. యూనివర్సిటీ ప్రగతి పథం వైపు
- ఏయూ.. ఓ దెయ్యాల కొంప అంటూ ప్రతిష్టను దిగజార్చిన టీడీపీ నేతలు
- ఇప్పుడు జాతీయ స్థాయిలో తొలి 3 యూనివర్సిటీల్లో ఒకటిగా నిలిచిన విశ్వవిద్యాలయం



ఆంధ్ర విశ్వ విద్యాలయం



ఎలిమెంట్ భవనం



ఆంధ్ర విశ్వవిద్యాలయం స్వాగత ద్వారం



అల్‌గారిథమ్ భవనం

సాక్షి, విశాఖపట్నం : ప్రైవేటు వర్సిటీల అడుగులకు మడుగులొత్తుతూ ప్రతిష్టాత్మక యూనివర్సిటీని తెలుగుదేశం పార్టీ పట్టించుకోకపోవడంతో మసకబారిన ఆంధ్ర విశ్వవిద్యాలయం.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చొరవతో కొత్త ఊపిరులందుకుంది. తమ ప్రైవేటు వర్సిటీ ఎదుగుదల కోసం ఏయూ ఓ దెయ్యాల కొంప అంటూ టీడీపీ నేతలు యూనివర్సిటీ ప్రతిష్టను దిగజార్చే వాఖ్యలు చేస్తే.. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతతో నాలుగేళ్ల కాలంలో సమాజ ఉపయుక్తంగా, పరిశ్రమల అవసరాలు తీర్చే వైవిధ్య పరిశోధన కేంద్రంగా ఆంధ్రా యూనివర్సిటీ తీర్చిదిద్దారు. విద్యార్థి అభ్యున్నతికి మార్గదర్శిగా పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా ఏయూని ప్రభుత్వం మార్చింది. వివిధ దేశాలు, యూనివర్సిటీలు, సంస్థల ఒప్పందాలతో చదువుకు సహకారం అందిస్తూ ప్రతి విద్యార్థిని ప్రోత్సహించాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్న ఏయూకి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వైస్‌చాన్స్‌లర్ ప్రొ.పీవీజీడీ ప్రసాదరెడ్డి నవ్య ఆలోచనలతో పనిచేస్తూ నూతన ప్రాజెక్టులను నిర్వహిస్తూ విశ్వవిద్యాలయ ప్రగతికి బాటలు వేశారు.

విశిష్ట గుర్తింపు

ఆంధ్రవిశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో నాక్ డబుల్ ప్లస్ గ్రేడ్‌ను, 3.74 సీజీపీఏ సాధించి సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఈ గుర్తింపు 2030 వరకు ఉంటుంది. ఆచార్యుల కొరత ఉన్న సమయంలో కూడా ఏయూ ఇంతటి విశిష్ట ర్యాంక్‌ను సాధించడం జాతీయ స్థాయిలో తొలి మూడు విశ్వవిద్యాలయాలలో ఒకటిగా ఏయూ నిలిచింది.

డ్రోన్ టెక్నాలజీకి చిరునామాగా..

ఏయూలో ప్రత్యేకంగా డ్రోన్ టెక్నాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వీరికి ఉపయుక్తంగా ఏయూలో మూడు హెలీప్యాడ్లను అందుబాటులో ఉంచారు. డ్రోన్ టెక్‌లో విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందిస్తున్నారు. కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల అవసరాలు అనుగుణంగా నూతనంగా అల్గారిథం భవనాన్ని నిర్మించారు. దీనిలో ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణకు ఒక అంతస్తును కేటాయించారు. విశాలమైన తరగతి గదులు, సమావేశ మందిరాలు నిర్మించారు. నాలుగేళ్ల కాలంలో ఏయూలో విదేశీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగి నేడు 55 దేశాలకు చెందిన వెయ్యి మందికిపైగా విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తుండటం విశేషం.

ఆక్రమణదారుల చెర నుంచి..

నగరం నడిబొడ్డున ఉన్న ఏయూకి చెందిన విలువైన ఆస్తులను టీడీపీ నేతలు తమ కబంధ హస్తాల్లోకి తీసుకున్నారు. యూనివర్సిటీ చుట్టూ ఉన్న భూములను దశాబ్దాలుగా ఆక్రమించి వ్యాపార సముదాయాలు నిర్మించారు. యూనివర్సిటీ గ్రౌండ్, దాని పరిసరాలన్నీ పొదలతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయాయి. ఆక్రమణల పర్వంపై వీసీ ప్రసాదరెడ్డి ఉక్కుపాదం మోపారు. దాదాపు రూ.400 కోట్ల విలువైన స్థలాలను ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుని ఆ స్థలాలను విద్యార్థులకు ఉపయుక్తంగా మలిచారు.

98 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా..

మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినులకు నూతన హాస్టల్ నిర్మాణం, ప్రయోగశాలలు, మౌలిక వసతుల్ని కల్పించారు. 98 ఏళ్ల వర్సిటీ చరిత్రలో ఫార్మసీ కళాశాల విద్యార్థినులకు తొలిసారిగా ప్రత్యేక హాస్టల్ భవనాన్ని కళాశాలకు చేరువలో నిర్మించారు. వర్సిటీ విద్యార్థులకు వసతి కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ నూతనంగా ఆరెంజ్, మెటా-హెచ్ హాస్టళ్లను నూతనంగా నిర్మించడంతో పాటు, విద్య ప్రగతి విహార్, విద్య తరంగిణి విహార్ హాస్టల్‌ను ఆధునికీకరించి అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటితో పాటు శాతవాహన హాస్టల్‌లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించారు. ప్రతీ విభాగంలో టాయిలెట్స్, విద్యార్థినుల రెస్ట్‌రూమ్‌లను పూర్తిగా మార్పు చేశారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఓపెన్ ఎయిర్ థియేటర్‌కు పూర్వవైభవం తీసుకువచ్చారు.

నలు దిశలా ప్రగతి

విద్యార్థులను ఆవిష్కర్తలుగా, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏయూ-నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను రూ.27 కోట్లతో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో గతంలో లేని విధంగా సొంతంగా ఒక స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్ ఆ-హబ్‌ను తీర్చిదిద్దారు. టీ-హబ్‌కు దీటుగా.. ఆ-హబ్‌లో ప్రస్తుతం 150కి పైగా స్టార్టప్ సంస్థలు ఇక్కడి నుంచి సేవలు అందిస్తున్నాయి. వేలాది మంది యువతకు ఉపాధిని అందిస్తున్నాయి. ఫార్మా రంగంలో స్టార్టప్, ఇంక్యుబేషన్ కేంద్రంగా ఎలిమెంట్ తీర్చిదిద్దారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ (ఏయూ సిబ్), అవంతి ఫీడ్స్ సంస్థ సహకారంతో ఏర్పాటైన ఏయూ-అవంతి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, మెరైన్ సంబంధిత రంగాలలో విశిష్ట పరిశోధనలు జరుపుతూ విజయవంతంగా పనిచేస్తోంది. ఆర్ఐఎన్ఎల్ సహకారంతో హ్యూమన్ జెనిటిక్స్ విభాగంలో బయోఆర్చర్ ఇంక్యుబేషన్ కేంద్రాన్ని, ఏయూ పూర్వ విద్యార్థి రవికిరణ్ స్థాపించిన టికాబ్స్-ఇ జీవశాస్త్ర సంబంధ పరిశోధనలు, ఆవిష్కరణలు చేస్తూ విద్యార్థులు పేటెంట్లు సాధించే దిశగా పనిచేస్తోంది. అంతర్జాతీయంగా జియో ఇంజినీరింగ్ ప్రాధాన్యతను ముందుగానే గుర్తించి జియో ఇంజినీరింగ్ విభాగాన్ని పటిష్టపరిచారు. రూ.67.5 కోట్లతో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) సంయుక్తంగా ఏయూతో ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. ఫుడ్ టెస్టింగ్, ఇంక్యుబేషన్ కేంద్రం ఏయూలో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఏపీ ఫుడ్ సొసైటీ రూ.5 కోట్లు మంజూరు చేసింది. ఏయూలో సేవలందిస్తున్న డిజిఫాక్ సంస్థకు వేలాది మంది యువతకు లో కోడ్ టెక్నాలజీపై ప్రత్యక్షంగా శిక్షణ అందిస్తూ ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది.

నాలుగేళ్లలో ఏయూ రూపురేఖలు మారిపోయాయి



నాలుగేళ్లలో యూనివర్సిటీ రూపురేఖలు మారిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో క్యాంపస్‌లో మునుపెన్నడూ లేని స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించారు. కొత్త భవనాలు నిర్మించారు. పాత వాటిని పునరుద్ధరించారు. మంచి పరిపాలన, కొత్త కోర్సుల రూపకల్పన, విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్‌పై ప్రధానంగా దృష్టి సారించారు. ఇప్పటి వరకు ఎవరూ చేయలేని విధంగా ప్రస్తుత వీసీ ప్రసాదరెడ్డి అన్యాక్రాంతమైన రూ.వందల కోట్లు విలువ చేసే ఏయూ భూములు తిరిగి యూనివర్సిటీకి దక్కేలా చేశారు. నిధుల సమీకరణతో కొత్తగా చైర్ కాన్సెప్ట్‌ను తీసుకువచ్చారు. ప్రధానంగా నాక్‌లో టాప్ ర్యాంక్ రావడం ప్రతి ఒక్కరూ గర్వించాల్సిన విషయం. ఏయూ సాధించిన ప్రగతికి అదే కొలమానం. అందుకే ఆయనకు రెండోసారి వీసీగా అవకాశం దక్కింది. అనుభవజ్ఞుడు, ఏయూ అభివృద్ధికి కృషి చేసిన వారిని వీసీగా నియమిస్తే రాజకీయాలు ఆపాదించడం సమంజసం కాదు. 2026లో ఏయూ శతాబ్ది ఉత్సవాలకు ఆయనలాంటి అనుభవజ్ఞుడు ఉండాల్సిన అవసరం ఉంది.

– ప్రొ.వి.బాలమోహన్‌దాస్, నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ, వీసీ ఫోరం అధ్యక్షుడు

వర్సిటీని మరింత బలోపేతం చేస్తా



నేను బాధ్యతలు తీసుకునే సమయంలో యూనివర్సిటీ హెరిటేజ్ స్ట్రక్చర్స్ పూర్తిగా శిథిలమైపోయాయి. వాటిపై దృష్టిసారించి.. ప్రభుత్వ సహకారంతో ఏయూని అభివృద్ధి చేశా. కోవిడ్ వంటి విపత్కర సమయాల్లో సైతం సకాలంలో పరీక్షలు పూర్తిచేసి, ఫలితాలను సకాలంలో అందించడం, ప్రత్యేకంగా ప్లేస్‌మెంట్ అధికారులను నియమించి ఆర్ట్స్, సైన్స్,న్యాయ కోర్సుల విద్యార్థులకు సైతం మెరుగైన ఉపాధి అవకాశాల్ని కల్పించాం. ఈ ఏడాది అత్యధికంగా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని రూ. 84.5 లక్షల వేతనంతో ఉద్యోగం సాధించి రికార్డు సృష్టించింది. బయట విద్యార్థులు సైతం ఏయూ గురించి ఆలోచించే స్థాయికి సీఎం సహకారంతో తీసుకొచ్చాం. క్యాంపస్ ప్రశాంతంగా ఉంది.. న్యూసెన్స్ అంతా మీడియాలోనే జరుగుతోంది. త్వరలోనే ఏయూ శతాబ్ది ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం. 20 ఏళ్లగా రిక్రూట్‌మెంట్ జరగలేదు. దానిపై ప్రభుత్వం దృష్టి సారించడం శుభపరిణామం

– ప్రొ.పీవీజీడీ ప్రసాదరెడ్డి, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి

పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి

- వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు



కుజ్జెలిలో పార్టీ నాయకులతో మాట్లాడుతున్న పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త విశ్వేశ్వరరాజు

సాక్షి,పాడేరు: రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలనే లక్ష్యంతో పార్టీ నాయకులు, కార్యకర్తలంతా గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు కోరారు. శుక్రవారం ఆయన కుజ్జెలి పంచాయతీని సందర్శించారు. సర్పంచ్ గబ్బాడ చిట్టిబాబు నివాసం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజనులకు అన్ని విధాలుగా మేలు జరిగిందని, సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం అమలుజేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు,కుజ్జెలి,కించూరు సర్పంచ్‌లు గబ్బాడ చిట్టిబాబు,వంతాల రాంబాబు పాల్గొన్నారు.

చంద్రబాబూ..ఆదివాసీలతో నీకు పనేంటి?

- మరోసారి మోసం చేసేందుకే అరకు పర్యటన
- ఓట్ల కోసం గిరిజనులపై కపట ప్రేమ
- ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ రామారావు దొర ధ్వజం



మాట్లాడుతున్న రామారావుదొర, జేఏసీ ప్రతినిధులు

అరకులోయ రూరల్: చంద్రబాబునాయుడూ.. ఆదివాసీ ప్రజలతో నీకు పనేంటని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ రామారావుదొర ప్రశ్నించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అరకు పర్యటన ఆదివాసీ ప్రజలను మరోసారి మోసం చేయడమేనని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి ఇప్పుడు ఓట్ల కోసం ఆదివాసీలపై కపట ప్రేమను చూపిస్తున్నారని విమర్శించారు. బోయ వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే మొదటి ప్రయత్నం చంద్రబాబు హయాంలోనే ఆరంభం ఆయిందన్నారు. బీసీ కులాలైన బోయలను ఎస్టీ వాల్మీకి కులాల్లో చేర్పించేందుకు 2017, డిసెంబర్ 2న అసెంబ్లీలో తీర్మానం చేసిన ఘనుడు మీరు కాదా అని ధ్వజమెత్తారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గిరిజన ప్రాంతంలో ఉన్న బాక్సైట్ ఇతర ఖనిజాలను తవ్వుకు పోవడం ఖాయమన్నారు. స్వార్థ ప్రయోజనాలకోసమే చంద్రబాబునాయుడు పనికి మాలిన రాజకీయం చేస్తున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆదివాసీలు టీడీపీ వ్యవహారశైలిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్ట్ పేరిట ప్రజా ధనాన్ని సొంత ప్రయోజనాల కోసం చంద్రబాబు వాడుకున్నారన్నారు. స్వార్థ ప్రయోజనమే లక్ష్యంగా చంద్రబాబు ఎత్తుగడలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలనుంచి అందినంత దోచుకున్నారన్నారు. అందుకే ప్రజలు 23 స్థానాలకు పరిమితం చేశారన్నారు. భవిష్యత్తులో టీడీపీ పార్టీ కనుమరుగు అవడం ఖాయమన్నారు. జేఏసీ మండల కన్వీనర్ సమర్థి గోపాల్, ప్రధాన కార్యదర్శి ఆనంద్,నాయకులు బుద్ధు,రాంచందర్ పాల్గొన్నారు.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సంతకం ఫోర్జరీ

- వెలుగులోకి నకిలీ ఉద్యోగ నియామక పత్రం.. పోలీసులకు ఫిర్యాదు

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఉద్యోగ నియామకపత్రం వెలుగుచూడటం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈనెల 19వ తేదీన వైద్య కళాశాలలో విధుల్లో చేరేందుకు కలెక్టరేట్‌కు రావాలని కళాశాల ప్రిన్సిపాల్ పేరుతో ఉన్న నకిలీ ఆర్డరును ఓ యువతి తీసుకురావడం కలకలం రేపింది. అరకులోయ మండలం సుంకరమెట్ట పంచాయతీ కిన్నంగుడ గ్రామానికి చెందిన కొర్రా అంజలిదేవి ఉద్యోగ నియామక (నకిలీ) పత్రం, ఇతర ధ్రువపత్రాలతో శుక్రవారం పాడేరు కలెక్టరేట్‌కు వచ్చింది. పోస్టల్ ద్వారా ఈ ఆర్డర్ వచ్చిందని కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి ఆమె చూపడంతో సీసీ వెంటనే వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. కళాశాల, ఆస్పత్రిలో పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రక్రియ అంతా మెరిట్ జాబితాల తయారీలో ఉందని, తన సంతకంతో వచ్చిన ఆర్డర్ నకిలీ అని ప్రిన్సిపాల్ తెలిపారు. దీంతో యువతి కొర్రా అంజలిదేవి, ఆమెతోపాటు వచ్చిన వారు కలెక్టర్ కార్యాలయం నుంచి బయటకు వెళ్లిపోయారు. దీనిపై వైద్య కళాశాల ప్రిన్సిపాల్ స్పందించారు. తన సంతకం ఫోర్జరీ చేసి నకిలీ నియామక పత్రం సృష్టించిన కొర్రా అంజలిదేవితోపాటు కారకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉపాధినిస్తున్న 'మాడగడ'



గిరిజన వస్త్ర ధారణలో సందడి చేస్తున్న పర్యాటకులు

ప్రముఖ పర్యాటక కేంద్రమైన మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటోంది. ప్రతిరోజూ ఈ ప్రాంతానికి దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తున్నారు. ఉదయం ఐదు గంటల నుంచి పది గంటల వరకు ఆడిపాడి సందడి చేయడంతో ఈ ప్రాంతం జాతరను తలపిస్తోంది. డప్పు వాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలతో గిరి మహిళలు నృత్యం చేస్తుంటే పర్యాటకులు కూడా గిరిజన వేషధారణలో వారితో కలిసి డ్యాన్స్ చేస్తున్నారు. గిరిజన వస్త్రధారణలో సిద్ధం చేసినందుకు ఒకొక్కరి నుంచి రూ.200 తీసుకుంటూ స్థానిక మహిళలు ఉపాధి పొందుతున్నారు. తినుబండారాల అమ్మకాలు భారీగా జరుగుతున్నాయి. సన్‌రైజ్ వ్యూపాయింట్‌కు తరలించడం ద్వారా ఆటో యజమానులు ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ సుమారు 300 కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

– అరకులోయ టౌన్



డప్పు వాయిద్యాలతో గిరిజన కళాకారుల సందడి



గిరిజన కళాకారులతో కలిసి పర్యాటకుల థింసా నృత్యం



మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్‌కు తరలివచ్చిన సందర్శకులు

ప్రతీ కుటుంబానికి వంద రోజుల పని దినాలు

- డ్వామా పీడీ శివయ్య ఆదేశం


ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందిస్తున్న డ్వామా పీడీ శివయ్య


సామాజిక తనిఖీ ప్రజావేదికపై అధికారులు

వీఆర్‌పురం: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిచేసే కుటుంబాలకు 100 రోజులు పనిదినాలు కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిదేనని డ్వామా పీడీ ఎం.శివయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదికకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కూలికి తగిన పనిని వేతనదారులకు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత సిబ్బందిపై ఉందన్నారు. మండలంలోని 11 పంచాయతీల్లో 2022 ఏప్రిల్ నుంచి 2023 డిసెంబర్ జరిగిన ఉపాధి హామీ పనులపై శాఖలవారీగా నిర్వహించిన సామాజిక తనిఖీల్లో వచ్చిన ఫలితాలపై విడతల వారీగా చర్చించారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా ఎన్‌ఆర్‌జీఎస్, పీఆర్, ఏహెచ్,ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పరిధిలో రూ.8.53 కోట్ల వ్యయంతో పనులు చేపట్టడం జరిగిందని పీడీ తెలిపారు. వీటిలో మెటీరియల్ కాంపోనెంట్ రూ.8.89 లక్షలు, కూలీల వేతనం రూ.7.16 కోట్లు కేటాయించినట్టుగా తెలిపారు. వివిధ పంచాయతీల్లో టీఏలు, ఎఫ్ఏలు చేసిన పొరబాట్ల నిమిత్తం సుమారు రూ.20 వేల వరకు అపరాధ రుసుం విధించామని ఆయన పేర్కొన్నారు. అనంతరం పెదమట్టపల్లి పంచాయతీ పరిధిలో 222 కుటుంబాలకు పూర్తి స్థాయిలో పని కల్పించి ప్రతిభ కనబరిచిన ఫీల్డ్ అసిస్టెంట్లు శంకర్,బొజ్జిలను పీడీ అభినందించి బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఎంపీడీవో ఆర్.ఫణీంద్రరెడ్డి, క్యూసీ వెంకటరమణ, అంబుడ్స్‌మెన్ జ్యోతి, ఏపీవో రాఘవయ్య,ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వినతులకు సకాలంలో పరిష్కారం

- కలెక్టర్ సుమిత్‌కుమార్


గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులు

సాక్షి,పాడేరు: జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నిశాఖల అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి గిరిజనుల నుంచి 51 వినతులను స్వీకరించారు. అలాగే అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని, ప్రతి వినతికి ఓ అధికారిని నియమించాలన్నారు. పరిష్కారమైన సమస్యలను స్పందన పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబంధిత ఫిర్యాదుదారుడికి తగిన సమాచారం ఇవ్వాలన్నారు. స్పందన కార్యక్రమాలకు అన్నిశాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, ముందస్తు అనుమతి తీసుకున్న తరువాతే దిగువ స్థాయి అధికారులు, సిబ్బందిని స్పందనకు పంపాలని ఆదేశించారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం, 26న భారత గణతంత్ర దినోత్సవాల్లో అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. జేసీ కార్తీక్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, డీఆర్వో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

స్పందన వినతులు

- ఎటపాక మండలం చింతలగూడెనికి చెందిన అంబటి వరలక్ష్మి, చిన్ననల్లకుంట గ్రామానికి చెందిన బోట్ల సత్యనారాయణలు తన వ్యవసాయ భూమిని వెబ్‌లాండ్‌లో నమోదు చేయాలని వినతిపత్రం అందజేశారు.
- జి.మాడుగుల మండలం కోడాపల్లి పంచాయతీ గిరిజనుడు బి.సింహాద్రి చావిడివీధిలో సీసీరోడ్డు నిర్మించాలని కోరారు
- రాజవొమ్మంగి మండలం లాగరాయి పాఠశాలలో నాడు-నేడు రెండవ విడతలో చేపట్టిన పాఠశాల అభివృద్ధి పనులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని బాలకృష్ణ కోరారు.ఇదే ప్రాంతానికి చెందిన నాగరాజు లబ్బర్తి గ్రామంలోని చెరువు ఆక్రమణలకు గురవుతుందని కాపాడాలని కోరారు
- పాడేరు మండలం పిల్లిపుట్టు గిరిజనులు రంజిత్, వికాస్‌లు గొండెలి నుంచి పిల్లిపుట్టు వరకు మెటల్ రోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేయాలని వినతిపత్రం అందజేశారు.

శ్రీవారికి అభిషేక సేవ

రంపచోడవరం : ఐ.పోలవరం జంక్షన్ సమీపంలోని తిరుపతి తిరుమల దేవస్థానం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీవారికి అభిషేక సేవ ఘనంగా నిర్వహించారు. వేదపండితులు శ్రీసాయిరాం శర్మ, అర్చకులు శ్రీ పార్థస్వామి, మణికంఠస్వామి తదితరులు కార్యక్రమం నిర్వహించారు. రంపచోడవరానికి భక్తులు శ్రీనివాసరావు, వరలక్ష్మి దంపతులు అన్నదానం నిర్వహించారు. ధర్మప్రచార సేవా భక్త మండలి కో-ఆర్డినేటర్ నల్లమిల్లి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో సేవాభక్త మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది ఆలయప్రాగణంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు.

కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట


ఒట్టిగెడ్డ రిజర్వాయర్ నీటిలో నిల్వ ఉంచిన కలప


స్వాధీనం చేసుకున్న కలపను ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలిస్తున్న సిబ్బంది

- పగలంతా నీటిలో నిల్వ.. రాత్రి పూట రవాణా
- పట్టుబడిన కలపను స్వాధీనం చేసుకొన్న అటవీఅధికారులు

రాజవొమ్మంగి: స్థానిక అటవీక్షేత్రం నుంచి నిత్యం విలువైన కలప ట్రాక్టర్లపై తరలిపోతోంది. పుష్ప సినిమాను తలపించే విధంగా కలపను పగటిపూట నీటి అడుగున నిల్వ ఉంచి, రాత్రి అక్రమంగా తరలిస్తున్నారు. పగటిపూట కలపను నరికి మండలంలోని అప్పలరాజుపేట సమీపంలోని ఒట్టిగెడ్డ రిజర్వాయర్ (జలాశయం) నీటి అడుగున భద్రపరుస్తున్నారు. ఆ కలపను అర్ధరాత్రి ట్రాక్టర్లపై రవాణా చేస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక అటవీ అధికారులు శుక్రవారం నీటిలో నిల్వ చేసిన కలపను స్వాధీనం చేసుకొన్నారు. కలపకు బహిరంగ మార్కెట్‌లో సొమ్ములు దండిగా లభిస్తుండడంతో ఈ ప్రాంతంలో కలప వ్యాపారం జోరుగా సాగుతోంది. దాడిలో ఎవరూ పట్టుబడలేదని, ఈ ప్రాంతంలో మరింత నిఘా పెంచి కలప రవాణాను అడ్డుకొంటామని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాము చెప్పారు.

కోతకు గురవుతున్న రిజర్వాయర్ గట్టు

అక్రమ కలప రవాణాకు అప్పలరాజుపేట వద్ద గల ఒట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రధాన గట్టు రహదారిగా మారింది. ఈ గట్టు పైనుంచి నిత్యం కలప, ఇసుక ట్రాక్టర్లు తిరుగుతుండడంతో గట్టు బలహీనపడుతోందని స్థానికులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల రాకపోకల వల్ల రిజర్వాయర్ ఫస్ట్ డ్రాపు వద్ద గల కాంక్రీట్ పనులు ఇప్పటికే చాలా వరకు ఛిద్రమయ్యాయని చెప్పారు. దీంతో రిజర్వాయర్ ఉనికే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ కలప రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు, ఈ జలాశయం కరకట్ట దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డోలీలో రోగి తరలింపు

అనంతగిరి: అనారోగ్యానికి గురైన వ్యక్తిని కుటుంబసభ్యులు డోలీలో ఆస్పత్రికి తరలించారు. మండలంలోని మారుమూల పినకోట పంచాయతీ రాచకీలం గ్రామానికి చెందిన సుకూరు బాబూరావు(18) అనే గిరిజన యువకుడు గత రెండురోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు.

కాళ్లుచేతులు వాపులు కారణంగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గ్రామానికి రహదారి సౌకర్యం లేనందున అంబులెన్సు వచ్చే పరిస్థితి లేదు. దీంతో బాబూరావును శుక్రవారం రాచకీలం నుంచి కొరపర్తి వరకు సుమారు ఏడు కిలోమీటర్లు డోలీలో మోసుకుని తీసుకువచ్చారు. అక్కడ నుంచి ఆటోలోని దేవరాపల్లి ఆస్పత్రికి తరలించారు.

సేవతోనే సంపూర్ణ ఆనందం


చీరలు అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, డాక్టర్ తమర్బ నరసింగరావు

సాక్షి,పాడేరు: స్వచ్ఛంద సంస్థలతో పాటు అన్ని వర్గాల ప్రజలు సేవాభావాన్ని అలవరుచుకోని పేద ప్రజలకు సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కోరారు. విజయవాడలోని సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన చిల్డ్రన్స్ స్కూల్స్, ట్యుటోరియల్స్ అసోసియేషన్ పేదలకు చీరలు, పలు రకాల దుస్తులను అందుబాటులోకి తెచ్చింది. వీటి పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేతో పాటు ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు ప్రారంభించారు. సేవలందిస్తున్న నిర్వాహకులను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అభినందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవతోనే సంపూర్ణ ఆనందం కలుగుతుందన్నారు. పేదలను ఆదుకునేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, నీలకంఠం, సన్నిబాబు, బసవన్నదొర, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, సభ్యుడు దశమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాడేరు సీఐగా నవీన్‌కుమార్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న నవీన్‌కుమార్


సాక్షి,పాడేరు: పాడేరు పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా సీఐ నవీన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఇంతవరకు పాడేరు సీఐగా పనిచేసిన సుధాకర్‌ను జిల్లా సోషల్ మీడియా సెల్‌కు బదిలీ చేశారు.సీఐ నవీన్‌కుమార్ శ్రీకాకుళం నుంచి బదిలీపై వచ్చారు. పాడేరు పోలీస్‌స్టేషన్ అప్‌గ్రేడ్ అవ్వడంతో సీఐను ఎస్‌హెచ్‌వోగా స్థాయి పెంచారు. దీంతో పాడేరుకు తొలి ఎస్‌హెచ్‌వోగా నవీన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరు సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని, గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటానన్నారు. రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా అన్ని వర్గాల ప్రజలు పోలీసుశాఖకు సహకరించాలని ఆయన కోరారు.

పకడ్బందీగా మిలాన్


అధికారులకు సూచనలు చేస్తున్న డీసీపీ శ్రీనివాసరావు

విశాఖ సిటీ: విశాఖ వేదికగా ఫిబ్రవరి 19 నుంచి బీచ్ రోడ్డులో జరగనున్న మిలాన్-2024 వేడుకలకు చేయాల్సిన ఏర్పాట్ల కోసం నేవీ, పోలీస్, వివిధ విభాగాల అధికారులు శుక్రవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. పరేడ్ జరిగే బీచ్ రోడ్డులో పలు ప్రాంతాలను సందర్శించి చేపట్టాల్సిన పనులను గుర్తించారు. మెయిన్ రోడ్డు వైపు, బీచ్ వైపు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సామాన్య పౌరులు రాక, పార్కింగ్ సదుపాయం, డబుల్ బారికేడింగ్, మెస్ బారికేడింగ్, ఎల్‌ఈడీ స్క్రీన్లు, సీసీటీవీ కెమెరాల ఏర్పాట్లపై సమీక్షించారు. డీసీపీలు శ్రీనివాసరావు, ఆనందరెడ్డి, తూర్పు నావికాదళ ప్రధాన కేంద్ర డిప్యూటీ నేవల్ ప్రోవోస్ట్ మార్షల్, కమాండర్ ఉదయ్ అగర్వాల్, ఐఎన్ఎస్ కళింగ ఎగ్జిక్యూటివ్ అధికారి కెప్టెన్ దివాకర్ శంకర్, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకుడు వి.మణిరామ్, ఇతర శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాల్సిన ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాసరావు, తూర్పు నావికాదళ డిప్యూటీ ప్రోవోస్ట్ మార్షల్ ఉదయ్ అగర్వాల్ ఇతర అధికారులకు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఎన్‌సీబీ (నేవల్ కోస్టల్ బ్యాటరీ) నుంచి ఆర్‌కే బీచ్ వరకు, అలాగే వుడా పార్క్ జంక్షన్ నుంచి ఆర్‌కే బీచ్ వరకు రోడ్డుకు ఇరువైపులా డబుల్ బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని నేవీ అధికారులకు సూచించారు. అదే విధంగా బీచ్ ప్రాంతంలో మెస్ బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని రహదారులు భవనాల శాఖ అధికారులకు చెప్పారు. సామాన్య పౌరులు వేచి ఉండేందుకు అనువుగా బాక్సులు ఏర్పాటు చేయాలని, అక్కడ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఉంచాలన్నారు. వాహనాల పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించిన వారు గతంలో మాదిరిగా ఏపీఐఐసీ గ్రౌండ్‌లో వీఐపీ పార్కింగ్ సదుపాయం కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. ఏయూ మైదానంలో ఇతర వాహనాల పార్కింగ్ నిమిత్తం ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు, సూచనలు చేసేందుకు అనువుగా పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏయే ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలో సంబంధిత అధికారులకు చెప్పారు. తాగునీటి సదుపాయం, బయోటాయిలెట్ల వసతి కల్పించాలన్నారు. ఎన్‌సీబీ, గోకుల్ పార్కు, పెరల్స్ పార్కు, ఆర్కే బీచ్, విశ్వప్రియ ఫంక్షన్ హాలు, పామ్ బీచ్ వద్ద నున్న మైదానాన్ని అధికారులు పరిశీలించారు.

జూకి సంక్రాంతి ఆదాయం రూ.18.48 లక్షలు


జూ పార్కు ముఖద్వారం

ఆరిలోవ: జూ పార్కుకు సంక్రాంతి తాకిడి పెరిగింది. పండగ సెలవులతో జూ పార్కు సందర్శకులతో కళకళలాడింది. వేలమంది సందర్శకులు సరదాగా గడిపారు. వారి ద్వారా రూ.లక్షల్లో ఆదాయం చేకూరింది. ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు జూకి తాకిడి పెరిగింది. నగరవాసులతో పాటు ఇతర ప్రాంతాలు నుంచి జూ పార్కును సందర్శించారు. ఈ వారంలో జూ పార్కును 22,606 మంది సందర్శించినట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. రూ.18,48,545 ఆదాయం లభించినట్టు వెల్లడించారు.

బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

- చెట్టును ఢీకొన్న బైక్
- భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు
- రామన్నపాలెం వద్ద ప్రమాదం


ప్రమాదానికి గురైన బైక్ (ఇన్‌సెట్) మృతి చెందిన భువనేశ్వరి(ఫైల్)

మాకవరపాలెం: మండలంలోని రామన్నపాలెం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. యలమంచిలిలో తమ బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు మండలంలోని జి.కోడూరు గ్రామానికి చెందిన ఆడారి నాగేశ్వరరావు(50), ఆయన భార్య భువనేశ్వరి(43) శుక్రవారం బైక్ పై వెళ్లారు. అక్కడ కార్యక్రమాలు పూర్తయిన తరువాత తిరిగి స్వగ్రామం వస్తుండగా రామన్నపాలెం జంక్షన్ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో భార్యాభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆటోలో మాకవరపాలెం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. భువనేశ్వరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా కొండలఅగ్రహారం వద్దకు వెళ్లేసరికి ఆమె మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం జరిగింది. మృతురాలి కుమారుడు అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్

- వినియోగదారుల గ్రీవెన్స్ ఫోరం చైర్మన్ డాక్టర్ సత్యనారాయణ


వినతుల స్వీకరిస్తున్న సత్యనారాయణ

అరకులోయ రూరల్: విద్యుత్ వినియోగదారుల సమస్యలు సత్వరంగా పరిష్కరించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగదారుల గ్రీవెన్స్ ఫోరం చైర్మన్ డాక్టర్ బి. సత్యనారాయణ తెలిపారు. విద్యుత్‌శాఖ స్థానిక కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరించారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని వినియోగదారులు అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు విద్యుత్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఎటువంటి సమస్యలు ఉన్న పూర్తి వివరాలతో ఫిర్యాదు చేస్తే 60 రోజులోపు సమస్య పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సాంకేతిక సహాయకులు జనార్దనరావు, ఏడీ సురేష్‌కుమార్, ఏఈ సత్యనారయణ, లైన్‌మన్లు రాంప్రసాద్, బుద్ధు,మహదేవ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

యువత పట్టుదలతో ముందుకు సాగాలి


గిరిజన యువతకు వీడ్కోలు పలుకుతున్న సీఆర్‌పీఎఫ్ అధికారులు


చింతూరు: యువత ఆత్మస్థైర్యం, పట్టుదలతో ముందుకు సాగడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని సీఆర్పీఎఫ్-42 బెటాలియన్ కమాండెంట్ ధర్మప్రకాష్ అన్నారు. గిరిజన యువతకు ఆత్మస్థైర్యం, బాహ్య ప్రదేశాలపై అవగాహన కల్పించే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా సీఆర్పీఎఫ్-42 బెటాలియన్ ఆధ్వర్యంలో చింతూరుకు చెందిన పదిహేడు మంది, డొంకరాయికి చెందిన ముగ్గురిని శుక్రవారం మహారాష్ట్రలోని నాగ్‌పూర్ యాత్రకు తీసుకెళ్లారు. ఈ సందరర్భంగా బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండెంట్ సెంథిల్ కుమార్, ఈ-42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ దివాకర్ వారికి చింతూరులో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన యువతకు దేశంలోని వివిధ ప్రదేశాలపై అవగాహన కల్పించే నిమిత్తం ఆరు రోజుల యాత్ర ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 20 మంది బృందానికి అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా యాత్ర చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని వారు పేర్కొన్నారు.

ఘనంగా అమ్మవారి సంబరం


అమ్మవారి జాతరకు తరలివచ్చిన గ్రామస్తులు

యలమంచిలి రూరల్: కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుత్‌కాంతులు.. బాణసంచా పేలుళ్లు..ఎంతసేపు చూసినా తనివితీరని సాంస్కృతిక ప్రదర్శనలు ఒకవైపు.. అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తజనం మరో వైపు..వెరసి పట్టణంలోని ధర్మవరంలో కనక మహాలక్ష్మి అమ్మవారి నెల రోజుల మహోత్సవం అంబరాన్ని తాకింది. లక్షమందికిపైగా భక్తులు రావడంతో పట్టణంలోని పలు రహదారులు కిటకిటలాడాయి. పట్టణంలోని ధర్మవరంలో మార్గశిర మాసం నెల రోజుల పాటు కనక మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేశారు. మార్గశిరమాసం పూర్తయిన తదుపరి సంక్రాంతి తరువాత అమ్మవారి నెల రోజుల పండగ నిర్వహించడం ఆనవాయితీ. శుక్రవారం అమ్మవారి నెల రోజుల పండగను ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ,గ్రామ పెద్దల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచి ఇసుకవేస్తే రాలనంతగా జనం తరలివచ్చారు. పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారిని దర్శించుకుని పుసుపు,కుంకుమలు సమర్పించారు. యలమంచిలి ప్రధాన రహదారి నుంచి ధర్మవరం వరకూ రహదారికి ఇరువైపులా పలు స్టాళ్లు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.జబర్దస్త్ అప్పారావు స్కిట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రత్యేక స్టేజీలపై పలు గ్రామాల నుంచి వచ్చిన కోలాట బృందాలు ప్రదర్శనలు నిర్వహించాయి.

విశాఖలో మెగాస్టార్


విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న చిరంజీవి

గోపాలపట్నం: మెగా స్టార్ చిరంజీవికి ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం లభించింది. శనివారం విశాఖలో లోక్ నాయక్ ఫౌండేషన్ నిర్వహించే కార్యక్రమంలో ఆయన పాల్గొనేందుకు విశాఖ వచ్చారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న ఆయనకు అభిమానులు స్వాగతం పలికారు. ఆయనతో ఫొటోలు దిగేందుకు ఎగబడ్డారు. చిరంజీవి ఎయిర్ పోర్టు నుంచి నేరుగా రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకున్నారు.